
ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025 | 5 | విజయనగరం



మానాపురం ఆర్‌ఒబి కాంట్రాక్టర్‌కు నోటీసులు

విజయనగరం :మానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం అయినందున కాంట్రాక్టర్ కు నోటీసు లు జారీ చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. నోటీసు అందిన రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని, లేనిచో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్లో ఆర్‌అండ్‌బి అధికారులతో సమావేశం నిర్వహించి పనులపై సమీక్షించారు. ఆర్‌ఒబి 2021 జూన్‌లో ప్రారంభమైందని, ఒప్పందం ప్రకారం జనవరి 2023కు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటికే 780 రోజులు ఆలస్యమైందని, దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. ఇంతవరకు 83.56 శాతం పనులు పూర్తయ్యాయని, 56.42 శాతం చెల్లింపులు జరిగాయని తెలిపారు. అగ్రిమెంట్ విలువ రూ.20.8 కోట్లు కాగా 17.268 కోట్ల విలువైన పనులు జరిగాయని, మిగిలిన పనుల విలువ రూ.3.532 కోట్ల వరకు ఉందని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్ కు నోటీసు జారీ చేయాలని, ఆలస్యానికి తగు వివరణ ఇవ్వాలని, లేదా చట్టం ప్రకారం చర్యలకు సిఫార్సు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ కాంతిమతి, ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

14 పాఠశాలలకు మంగళం!

ఎత్తివేతకు ప్రతిపాదనలు ● విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం



తమ పిల్లలను మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించేది లేదంటూ నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

జీవో నెంబర్ 117 రద్దుతో పెనం మీద నుండి పొయ్యిలో పడినట్టయ్యింది రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి. గతంలో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోతో పాఠశాలలను విలీనం చేయడంతో చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమైన విషయం తెలిసిందే. అయితే అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేస్తామని ప్రకటించింది. కానీ పేరుకు జీవో రద్దు చేశారు తప్ప ఆ జీవోలో ఉన్న విధానాలనే టిడిపి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలో 14 ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదముంది. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో విద్యార్థులకు శాపంగా మారనుంది. ప్రతి పంచాయతీలోనూ మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయనుండడంతో ఇప్పటికే ఉన్న పాఠశాలలు కనుమరుగుకానున్నాయి.

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని 28 పంచాయతీల్లో 82 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యావ్యవస్థలోని తీసుకొస్తున్న విధానాల్లో భాగంగా పంచాయతీకి ఒక్కటి చొప్పున మోడల్ ప్రైమరీ స్కూలు పెట్టేందుకు విద్యాశాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మండలంలో 22 మోడల్ ప్రైమరీ పాఠశాలలు పెట్టేందుకు సర్వే పూర్తయ్యింది. అయితే ఈ పాఠశాలల ఏర్పాటు వల్ల మండలంలోని 14 పాఠశాలలను ఏత్తివేయడానికి ప్రణాళిక సిద్ధమైంది. అందులో రెల్లివలస-1, రెల్లివలస-2, కుమిలి-2, కుమిలి -3, మర్రిపేట, పులిగెడ్డ, బిజి పేట, పాత నడువల్లి, పోరాం, తులసిదిబ్బ, వెంపడాం హచ్, పిట్టపేట, కొణతాలపాలెం, కోనాయపాలెం పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో ఉన్న 1, 2 తరగతుల విద్యార్థులు ఐదు లోపు ఉన్నారన్న కారణంతో వాటిని మూసివేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మా పాఠశాలను తరలిస్తే ఊరుకోం

మోడల్ ప్రైమరీ పాఠశాలలంటూ తమ ఊర్లో ఉన్న పాఠశాల పిల్లల్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొళ్లాయివలస వెల్లమంటే వెళ్లేది లేదని పులిగెడ్డ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారు. తామంతా మత్స్యకారులమని, తమ ఊర్లో పాఠశాలను పంపించడానికే నానా తంటాలు పడుతుంటామని వాపోతున్నారు. ఇప్పుడు తమ ఊర్లో నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి వెళ్లమంటే ఎలా వెళ్లాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సముద్రంలోకి వేటకు తీసుకు పోతాం తప్ప దూరంగాఉన్న పాఠశాలకు పంపలేమని అంటున్నారు. పులిగెడ్డ ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 వ తరగతిలో మొత్తం 22 మంది విద్యార్థులు చదువుతున్నారు. 3, 4, 5 తరగతులకు సంబంధించి 14 మంది విద్యార్థులను పంచాయతీలో ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీకి తరలించేందుకు సిద్ధం చేసారు. దాంతో ఆ గ్రామంలో పాఠశాలలో 8 మంది మాత్రమే విద్యార్థులు మిగులుతారు. ఈ ఏడాది ఎలాగున్నా వచ్చే ఏడాది పాఠశాలకు మంగళం పాడే ప్రమాదం ఉంది.విషయం తెలుసుకున్న మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల మాన్పించేస్తాం



మా గ్రామంలో పాఠశాల నుండి 3,4,5 తరగతి విద్యార్థులను తరలించే ప్రయత్నం అపుకోవాలి. చదువును మాన్పిస్తాం కానీ అక్కడకు పంపము. మా ఊరు నుండి నాలుగు కిలోమీటర్లు దూరంలో కొళ్లాయివలస ఉంది. అక్కడకు వెల్లాలంటే తోటలు మధ్యలో నుండి నడిచి వెళ్లాలి. అలా పంపించే ఆలోచన లేదు. అందుకే ఈ విషయమై కలెక్టర్‌కు వినతి అందజేశాం

ఆకుల క్రిష్ణమ్మ, చైర్మన్, పులిగెడ్డ పాఠశాల

ఎమ్మెల్యే దృష్టిలో పెట్టాం



మత్స్యకార గ్రామమైన పులిగెడ్డ పాఠశాల విద్యార్థులను సమీపంలో ఉన్న కొళ్లాయి వలస మోడల్‌ప్రైమరీ పాఠశాలకు వెళ్లాలని చెప్పారు. అయితే విషయం తెలుసుకున్న తాము ఎమ్మెల్యే లోకం నాగమాధవికి దృష్టికి తీసుకువెళ్లాం. మత్స్యకార గ్రామాల్లో పాఠశాల విద్యార్థులను తరలించొద్దని ఆమె అధికారులకు తెలిపారు. పాఠశాలతో పాటు పిల్లలూ ఉంటారు.

వందనాల అప్పలరాజు, జనసేన నాయకులు, కొళ్లాయివలస

సర్వే పూర్తి చేశాం



పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ పెట్టాలని సర్వే చేయమన్నారు. సర్వే పూర్తి చేశాం. మోడల్ ప్రైమరీలు పెడితే మొత్తం 14 పాఠశాలలు 3 కిలో మీటరు దూరంలో ఉన్నాయి. బిజి పేట, పులిగెడ్డ మూడు కిలోమీటర్ల పైగా దూరంలో ఉన్నాయి. వాటిమీద అభ్యంతరాలు ఉన్నాయి. మిగతా మరికొన్ని పాఠశాలలపై కూడా అభ్యంతరాలు ఉన్నాయి. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే లోకంనాగమాధవి దృష్టిలో ఉంది. పాఠశాలలు కొనసాగే అవకాశాలున్నాయి.

రాజ్‌కుమార్, ఎంఇఒ, పూసపాటిరేగ



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, నేవీ ఆయుధ డిపో బాధిత రైతులు

ఎన్‌ఎడికి వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి-బాడంగి

బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ వద్ద నేవీ ఆయుధ డిపో (ఎన్‌ఎడి) ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎ.సురేష్, పాల్తేరు ఎంపిటిసి సభ్యులు రమేష్, సర్పంచ్ ప్రతినిధి అప్పలనాయుడు మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు నేవీ, రెవెన్యూ అధికారులు గత కొద్దిరోజులుగా భూములు పరిశీలిస్తున్నారని చెప్పారు. సుమారు 1800 ఎకరాలు అవసరమని, ఇందులో ప్రభుత్వ భూమి 300 ఎకరాలు ఉండని, మిగతా 1500 ఎకరాలను పాల్తేరు, పిన్నవలస, రామచంద్రపురం, ముగడ, కోడూరు, మల్లంపేట తదితర గ్రామాల రైతుల నుంచి సేకరించాలని ప్రతిపాదన చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆయుధ డిపో పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రైతులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని స్పష్టంచేశారు. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఆయుధ డిపోకు లాక్కోవాలని చూడటం దారుణమన్నారు. ఈ ప్రాంతానికి తీవ్రంగా నష్టం కలిగించే ఎన్‌ఎడి అవసరం లేదని తెగేసిచెప్పారు. బలవంతంగా ఆయుధ డిపో పెట్టాలనే నిర్ణయం చేస్తే ప్రాణాలకు తెగించైనా పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌మూర్తికి కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలోని ట్రాఫిక్ కానిస్టేబులుగా పని చేస్తూ, ఇటీవల పంజాబు రాష్ట్రం జలంధర్‌లో జరిగిన 1వ ఆలిండియా పోలీసు కబడ్డీ క్లస్టర్ 2024-25 పోటీల్లో కానిస్టేబుల్ బిఎస్‌ఎన్ మూర్తి కాంస్య పతకం సాధించారు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఎస్‌పి వకుల్ జిందాల్ తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. జిల్లాకు చెందిన బి.ఎస్.ఎన్. మూర్తి ఫెన్సింగ్ విభాగంలోని సీనియర్స్ ఫోయిల్స్ లో రాష్ట్ర పోలీసు జట్టు తరుపున పాల్గొని కాంస్య పతకం సాధించారని ఎస్‌పి తెలిపారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన కానిస్టేబులు మూర్తిని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా మంగళగిరిలోని రాష్ట్ర డిజిపి కార్యాలయంలో అభినందించారు. పతకాలు సాధించినపోలీసు సిబ్బందికి త్వరలో ప్రోత్సాహక నగదు బహుమతిని, అదనంగా వార్షిక ఇంక్రిమెంటు అందించనున్నారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాలనాయుడు, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్కో డైరెక్టర్‌గా బంగార్రాజు

ప్రజాశక్తి-భోగాపురం



మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు... రైతుల కోసం ఎరువులు తయారు చేసే ప్రముఖ జాతీయ ప్రభుత్వ రంగ సంస్థ ఇఫ్కో డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ పదవికి రెండు రోజుల కిందట విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి డైరెక్టర్ పదవికి బంగార్రాజు నామినేషన్ వేశారు. డైరెక్టర్ పదవికి ఆయన ఎన్నికైనట్లు ఇఫ్కో శుక్రవారం ప్రకటించింది. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు తెలిపారు.

కెజిబివిల్లో ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 26 కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6,11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుండి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు పంపవచ్చునని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి. బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని తెలిపారు. దరఖాస్తు https://apkgbv.apcfss.in సైట్ ద్వారా పొందాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు, సందేహాలకు సంబంధిత కెజిబివి ప్రిన్సిపాల్స్ ను సంప్రదించాలని కోరారు.

రెల్లిపేటపై పాలకుల నిర్లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - జామి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

భీమసింగిలోని రెల్లిపేటకు చెందిన 20 కుటుంబాలకు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, కానీ ఇంతవరకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకానికి నోచుకోక పోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెల్లిపేటలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం బాధిత కుటుంబాలతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ భీమసింగి గ్రామంలో దళితులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు, రోడ్లు, కరెంటు వంటి సమస్యలతోపాటు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరికి పథకాల మంజూరు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు ఈ నెలాఖరులోగా పథకాలను మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. వివిధ పథకాలు, వాటి మంజూరులో బ్యాంకుల పరిస్థితిని ఎల్‌డిఎం వివి రమణమూర్తి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ పథకం ద్వారా మంజూరు చేసిన 2,624 యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఖాదీబోర్డు ద్వారా మంజూరు చేసిన యూనిట్ల సంఖ్య తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. 16,135 మందికి కౌలు రైతుల గుర్తింపు కార్డులిస్తే, 1395 మందికి మాత్రమే సుమారు రూ.7కోట్ల మేర రుణాన్ని ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతీఒక్కరికీ రుణం మంజూరు చేయాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం క్రింద ఇప్పటివరకు సుమారు 492 యూనిట్లు ఏర్పాటు చేశారని, మంజూరై మిగిలిన 178 యూనిట్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డు పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్‌ను వివరించారు. సుమారు రూ.10,650.32 కోట్ల అంచనాతో ఈ రుణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, పశు సంవర్థకశాఖ జెడి వైవి రమణ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, మెప్మా పీడీ చిట్టిరాజు, ఉద్యాన, మత్స్యశాఖల డిడిలు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కోరుతా

కలెక్టర్ల సదస్సుపై సన్నాహక సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

వ్యవసాయ రంగంలో జిల్లా 15శాతానికి పైగా వృద్ధి రేటు సాధించేందుకు వీలుగా జిల్లాకు ప్రధానమైన తోటపల్లి కుడి ప్రధాన కాలువ, తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని త్వరలో జరిగే జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రిని కోరనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఆయా ప్రాజెక్టుల పనులు, భూసేకరణ, పునరావాసం పూర్తిచేసేందుకు ఏమేరకు నిధులు అవసరమవుతాయో జలవనరుల శాఖ అధికారులు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ, తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా సుమారు 50వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించి తద్వారా వ్యవసాయ రంగంలో అదనపు ఉత్పత్తిని, ఆదాయాన్ని సాధించే అవకాశం వుంటుందన్నారు. దీంతోపాటు నగరానికి మంచినీటి సరఫరా, భోగాపురం ఎయిర్‌పోర్టుకు నీటి సరఫరా జరిగే అవకాశం వున్నందున ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తిచేయాల్సిన అవసరాన్ని వివరిస్తామని చెప్పారు.

సాగునీటి కాలువల మరమ్మత్తులకు అవసరమైన నిధులను కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి విడుదల చేయిస్తామని, ఆ నిధులను వినియోగించి ప్రస్తుత వేసవిలోనే ఆయా పనులు పూర్తిచేసి వచ్చే ఖరీఫ్‌లో ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీటిని అందించేలా జలవనరుల శాఖ అధికారులు బాధ్యత వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ల సదస్సు మార్చి 25, 26 తేదీల్లో అమరావతిలో జరగనున్న నేపథ్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై, వృద్ధి రేటు సాధనకు అనుసరించే కార్యాచరణ ప్రణాళికలపై ఆయా జిల్లాల కలెక్టర్లు రెండు రోజుల సదస్సులో ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో భాగంగా జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశమై చర్చించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే అదనంగా ఎంతమేరకు లక్ష్యాలు సాధించగలమో పేర్కొంటూ వాస్తవిక అంచనాలను మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలు తమ లక్ష్యాలు సాధించేందుకు చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికను కూడా స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, పరిశ్రమలు వాటి అనుబంధ శాఖలు, సేవరంగానికి సంబంధించిన విభాగాలపై సబ్ సెక్టార్ల వారీగా 17 అంశాలపై నివేదికలు రూపొందించి కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్ ఇవ్వనున్నట్టు కలెక్టర్ చెప్పారు.జిల్లాలో పాడిపరిశ్రమతో పాటు కోళ్ల పరిశ్రమ రంగం అభివృద్ధికి గల అవకాశాలను కూడా పరిశీలించాలని పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ వైవి రమణను ఆదేశించారు. వ్యవసాయ రంగంలో వచ్చే ఏడాది ఖరీఫ్ పంటవిస్తీర్ణం పెరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ప్రస్తుతం సాగుచేస్తున్నదీ పేర్కొంటూ ఈ ఏడాది ఎంత విస్తీర్ణంలో సాగు పెరిగేదీ తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని ఉద్యాన అధికారిని ఆదేశించారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలో చింతపల్లి వద్ద ఫిషింగ్ జెట్టీ నిర్మాణం పూర్తిచేస్తే మత్స్య రంగం వల్ల జిల్లాకు కలిగే అదనపు ప్రయోజనాలు వివరిస్తూ నివేదిక ఇవ్వాలని మత్స్యశాఖ జిల్లా అధికారిని ఆదేశించారు. జిల్లాలో తక్కువ బరువు వున్న పిల్లలకు అదనపు పోషకాహారం అందించే విషయమై నివేదిక ఇవ్వాలని మహిళా శిశు సంక్షేమశాఖ పీడీని ఆదేశించారు. గతంలో ఎప్పటి నుంచి అదనపు రేషన్ నిలిపివేశారో ఆ వివరాలు ఇవ్వాలని చెప్పారు.

సమావేశంలో సిపిఓ పి.బాలాజీ, డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి కళ్యాణ చక్రవర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో ఎంఆర్ అగ్రహారం రెవెన్యూ పరిధిలో ఎన్‌ఎస్‌ఆర్ ఎల్లాయిస్ పరిశ్రమ ఏర్పాటుపై శుక్రవారం డిఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు చీఫ్ ఇంజినీర్ ప్రసాదరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ సరితతోపాటు ఎంఆర్ అగ్రహారం, ఎం.గదబవలస, రంగప్పవలస, ఉత్తరావల్లి గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఎంఆర్ అగ్రహారం సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకట్రావు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల ప్రజలకు, పంట పొలాలకు ఎలాంటి నష్టమూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్థానికులకు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పరిశ్రమ యాజమాన్య ప్రతినిధి యుఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల రైతులకు, పంట పొలాలకు ఎలాంటి నష్టమూ ఉండదని, దానికి బాధ్యత వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.హేమంత్ కుమార్, ఎస్‌ఐ జి.సాగర్ బాబు, ఎంఆర్‌ఐ ఎంఎస్‌కె నాయుడు, విఆర్‌ఒ ఎస్.నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.హైమావతి, నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

కేంద్ర పథకాల అమలుతో రక్తహీనత తగ్గుదల

జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం అంచనా ● కలెక్టర్‌కు వివరించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వం రక్తహీనతను నివారించేందుకు ప్రవేశపెట్టిన పలు పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేస్తున్న కారణంగానే జిల్లాలో రక్తహీనత తగ్గిందని జిల్లాలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ వైద్య నిపుణుల బృందం అభిప్రాయపడింది. ఈ మేరకు రెండు రోజులుగా రక్తహీనత తగ్గడానికి గల కారణాలపై అధ్యయనం చేసిన కేంద్ర బృందం ప్రతినిధులు ఐఎవిఎ- ఇండియా సంస్థ ఆరోగ్య వ్యవస్థ విధాన పరిశోధనకు చెందిన సీనియర్ మేనేజర్ డాక్టర్ దృష్టి శర్మ, ప్రత్యేక నిపుణులు డాక్టర్ జాస్మిన్ శుక్రవారం కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కలిసి తమ పర్యటన ఉద్దేశ్యాన్ని, జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాత గుర్తించిన అంశాలను వివరించారు. రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తమ బృందం రెండు రోజులపాటు అధ్యయనం చేసిందని వారు తెలిపారు. రక్తహీనత తొలగించడంలో ముఖ్యమైన కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎనిమీయా ముక్త్ భారత్, ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఆర్‌బిఎస్‌కె, ఉపాధిహామీ, జాతీయ గ్రామీణ జీవనోపాధుల కార్యక్రమం, సమగ్రశిక్ష, ఆర్‌ఎంఎస్‌ఎ, జల్ జీవన్ మిషన్, స్వచ్‌భారత్ అభియాన్ దోహదపడినట్లు గుర్తించామని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని పూసపాటి రేగ మండలంలో పర్యటించి గర్భిణీలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, కౌమార బాలికలతో మాట్లాడామని వారు వివరించారు. అత్యంత వెనుకబడిన గిరిజన ప్రజల అవసరాలు తీర్చడం కోసం రోడ్లతో అనుసంధానం, విద్యుత్, జీవనోపాధి కల్పించడం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చడం ద్వారా వారిలోనూ రక్తహీనత తగ్గించడం సాధ్యమైందని గుర్తించామన్నారు. 12 జిల్లాల్లో రక్తహీనత తగ్గుదలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నట్టు వారు తెలిపారు. డిఎంహెచ్ఒ జీవనరాణి కూడా బృందంతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిశారు.

డిఎల్‌ఎస్‌ఎలో పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-వియనగరం లీగల్

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా జడ్జి బి. సాయి కళ్యాణ చక్రవర్తి ఒక ప్రకటన లో తెలిపారు. ఎడిఆర్ మీడియేషణ్ కేంద్రం లో 2 పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన (ఎస్‌సి ఉమెన్, ఒసి పోస్టులకోసం) దరఖాస్తులను నిర్దేశిత ప్రోఫార్మలో పూరించి జిల్లా కోర్టు భవనంలో నున్న జిల్లా న్యాయ సేవల కేంద్రంలో అందజేయాలని తెలిపారు. కవర్ పై ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి కం చైర్మన్, జిల్లా న్యాయ సేవల సంస్థ, కోర్టు కాంప్లెక్స్, విజయనగరం అని రాసి సమర్పించాలని ఆ ప్రకటన లో తెలిపారు.



మైలాన్ పరిశ్రమ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

'ప్రీతికా' కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి

మైలాన్ పరిశ్రమ ఎదుట కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కార్మికులను మోసం చేస్తున్న ట్రియానిష్ లేబోరేటరీ (మైలాన్)లో ప్రీతికా ఇంజినీరింగ్ ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ దిలీప్‌పై చర్యలు తీసుకోవాలని కార్మికులు శుక్రవారం పరిశ్రమ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 77 మంది 20 ఏళ్లుగా మైలాన్‌లో ఫ్యాబ్రికేషన్ పని చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ దిలీప్ గత 3 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. పిఎఫ్, ఇఎస్‌ఐ కట్టలేదన్నారు. కాంట్రాక్టర్ జిఎస్‌టి కూడా కట్టలేదని పరిశ్రమ యాజమాన్యం తమను పనిలోకి రానివ్వడం లేదని వాపోయారు. పరిశ్రమ ప్రతినిధులు, కాంట్రాక్టర్‌కు, తమకు సుమారు 15 సార్లు చర్చలు జరిగినా, ఫలితం లేదని చెప్పారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు దగ్గర కూడా పంచాయితీ జరిగినా ఫలితం లేదన్నారు. కాంట్రాక్టర్‌కు పరిశ్రమ యాజమాన్యం కొమ్ముకాసి, తమకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతోపాటు మిగతా మూడు ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ కార్మికులు శుక్రవారం విధులకు హాజరుకాలేదని చెప్పారు. కార్మికులకు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు స్వామినాయుడు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. మూడు నెలలుగా కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. నిరసనలో కార్మికులు ఎస్.సూరి భాస్కరరావు, జె.సూరిబాబు, మధు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో నెల్లిమర్ల ఫస్ట్

రెండో స్థానంలో బొబ్బిలి

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో ఆస్తిపన్ను వసూళ్లలో నెల్లిమర్ల నగర పంచాయతీ మొదటి స్థానం నిలిచింది. బొబ్బిలి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలో విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపాలిటీతోపాటు రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీలున్నాయి. ఇక్కడ ఈ నెలాఖరులోగా ఆస్తిపన్ను వంద శాతం వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రయివేట్ భవనాల నుంచి నెల్లిమర్ల 86.02 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, 68.79 శాతంతో బొబ్బిలి రెండో స్థానంలో ఉంది. 67.01 శాతంతో రాజాం నగర పంచాయతీ మూడో స్థానంలో, 62.51 శాతంతో విజయనగరం కార్పొరేషన్ అట్టడుగున నిలిచింది. నెలాఖరికి ఆస్తిపన్ను వసూలు లక్ష్యాలను చేరుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం పనిచేస్తోంది.

ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు ముమ్మరం చేస్తున్నారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. ప్రయివేట్ భవనాలకు గాను నెల్లిమర్ల నగర పంచాయతీలో 5,452 భవనాల నుంచి రూ.1.48 కోట్లు పన్ను డిమాండ్ ఉండగా, రూ.1.27 కోట్లు వసూలు చేశారు. బొబ్బిలి మున్సిపాలిటీలో 12,949 భవనాల నుంచి రూ.5.53 కోట్లు డిమాండ్ ఉండగా, రూ.3.80 కోట్లు వసూలు చేశారు.



పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

రాజాం నగర పంచాయతీలో 12,189 భవనాల నుంచి రూ.3.22 కోట్లు డిమాండ్ ఉండగా రూ.2.16 కోట్లు వసూలు చేశారు. విజయనగరం కార్పొరేషన్ లో 70,413 భవనాల నుంచి రూ.41.15 కోట్లు డిమాండ్ ఉండగా, రూ.25.72 కోట్లు వసూలు చేశారు.

అన్ని రకాల పన్నుల వసూళ్లలో..

ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో రాజాం నగర పంచాయతీ మొదటి స్థానంలో నిలిచింది. ఇందులోనూ బొబ్బిలి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచింది. రాజాంలో రూ.3.52 కోట్లు డిమాండ్ ఉండగా రూ.2.34 కోట్లు వసూలు చేసి 66.43 శాతంతో మొదటి స్థానాన్ని కైవశం చేసుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీలో రూ.7.44 కోట్లు డిమాండ్ ఉండగా రూ.4.16 కోట్లు వసూలు చేసి 55.93 శాతంతో రెండో స్థానంలో ఉంది. విజయనగరం కార్పొరేషన్‌లో రూ.62.77 కోట్లు డిమాండ్ ఉండగా రూ.30.32 కోట్లు వసూలు చేసి 48.30 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. నెల్లిమర్ల నగర పంచాయతీలో రూ.5.32 కోట్లు డిమాండ్ ఉండగా, రూ.1.35 కోట్లు వసూలు చేసి 25.36 శాతంతో అట్టడుగు స్థానానికి పరిమితమైంది. ప్రయివేటు భవనాల పన్నుల వసూళ్లలో మొదటి స్థానంలో ఉన్న నెల్లిమర్ల నగర పంచాయతీ... అన్ని రకాల పన్నుల వసూళ్లలో చాలా వెనుకబడటం గమనార్హం.

ప్రయివేట్ భవనాల నుంచి ఆస్తిపన్నుల వసూళ్లను పరిశీలిస్తే..

మున్సిపాలిటీ	భవనాలు	లక్ష్యం	వసూళ్లు	శాతం
నెల్లిమర్ల	5,452	1.48 కోట్లు	1.27 కోట్లు	86.02
బొబ్బిలి	12,949	5.53 కోట్లు	3.80 కోట్లు	68.79
రాజాం	12,189	3.22 కోట్లు	2.16 కోట్లు	67.01
విజయనగరం	70,413	41.15కోట్లు	25.72 కోట్లు	62.51

ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో ఇదీ పరిస్థితి

మున్సిపాలిటీ	లక్ష్యం	వసూళ్లు	శాతం
రాజాం	3.52 కోట్లు	2.34 కోట్లు	66.43
బొబ్బిలి	7.44 కోట్లు	4.16 కోట్లు	55.93
విజయనగరం	62.77కోట్లు	30.32కోట్లు	48.30
నెల్లిమర్ల	5.32 కోట్లు	1.35 కోట్లు	25.36

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 24, 25వ తేదీల్లో ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మద్దతు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, టెంపరరీలను రెగ్యులర్ చేయాలని, ద్వైపాక్షిక ఒప్పందాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలను ఉపసంహరించాలని, తదితర డిమాండ్లపై సమ్మె చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యుఎఫ్‌బియు నాయకత్వంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా చేస్తున్న సమ్మెకు ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో బెఫీ యూనియన్ నాయకులు చందు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎండిఎం కార్మికుల వినతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒకు వారంతా వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలకూ జీతాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. విద్యార్థులకు రూ.20 చొప్పున మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. ఎండిఎం కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం అందించాలని కోరారు. ఎండిఎం కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ.ఐదు లక్షలు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు ఎం.కృష్ణవేణి, పి.నారాయణమ్మ, ఎ.సంతోష్, ఎన్.సూరమ్మ, పి.ఈశ్వరమ్మ, బి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పారి స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

యుటిఎఫ్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణకు పోరాటం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. స్థానిక తాండ్ర పాపారాయ మున్సిపల్ పాఠశాలలో శుక్రవారం అప్పారి వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయగౌరి మాట్లాడుతూ విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్‌ను స్థాపించి అనేక పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. యుపి పాఠశాలలను మూసి వేసే నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవ, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సామూహిక మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. శుక్రవారం పట్టణంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ కార్యాలయాన్ని సందర్శించి, కార్మికుల మస్టర్ రికార్డులను పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరు కావాలని కార్మికులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూరగాయల మార్కెట్లో ఉన్న పబ్లిక్ టాయిలెట్, జంగాల శివాలయం వీధిలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పైపులైన్ లీకులను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మెడికల్ షాపుల్లో డ్రగ్స్ కంట్రోల్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఆపరేషన్ గరుడలో భాగంగా డిజిపి ఆదేశాల మేరకు శుక్రవారం మూడు మెడికల్ షాపులను తనిఖీ చేశారు. మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని సిఐ శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సతీష్ చెప్పారు.

పొలాలకు రహదారి సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి-భోగాపురం

పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని భోగాపురం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తహశీల్దార్ ఎం.సురేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చాకివలస వెళ్లే రహదారిలో సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న కాలిబాటను సర్వే చేసి తమకు అప్పజెప్పితే రోడ్డు వేసుకుంటామని తెలిపారు. కాలిబాటను మండల సర్వేయర్‌తో సర్వే చేసి పరిశీలిస్తామని తహశీల్దార్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొమ్మూరు సుబోషణరావు, అడ్డగర్ల రమేష్, రాంబాబు, దిలీప్, సింగన్నబంద, గున్నతోట ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పి4 సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదరిక నిర్మూలనకు, సంఘాల సాధికారిత కోసమే పి 4 సర్వే లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేక సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పి 4 అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా ప్రవాస ఆంధ్రులు, సంపన్న కుటుంబాలు రాష్ట్రంలోని అత్యంత వెనుకబడ్డ కుటుంబాలకు సహాయం చేయడానికి, ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుందన్నారు. పి4 విధానం కేవలం దాతృత్వానికి పరిమితం కాకుండా దీర్ఘకాలిక సాధికారత, భాగస్వామ్య సంపన్నత అనే లక్ష్యంతో సాగాలన్నారు. ఈ విధానంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి మంచి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో వార్డు సభలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో శుక్రవారం జరజాపుపేట-1, 2 మొయిద జంక్షన్-1, గాంధీ నాగర్ కాలనీ, మొయిద జంక్షన్-2 సచివాలయాల పరిధిలో పి-4 కార్యక్రమంపై వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యక్షంగా దత్తత తీసుకుని వారికి మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించే మార్గాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. పి-4 కేవలం దాతృత్వానికి పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సాధికారత, భాగస్వామ్య సంపన్నత అనే లక్ష్యాలను నెరవేర్చే విధంగా రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఓ సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

డౌన్‌సిండ్రోమ్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యాన డౌన్ సిండ్రోమ్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. డౌన్‌సిండ్రోమ్‌తో బాధపడుతున్న పది మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల సమకూర్చిన చెక్కులను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త సిరికి సూర్యారావు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎఎంఒ ప్రసాద్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, ఐఇఆర్‌పి సత్యనారాయణ పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై జాగ్రత్త

ప్రజాశక్తి-గజపతినగరం

నోటి ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్ తెలిపారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన ఆధ్వర్యాన గజపతినగరంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన నోరు మంచి శారీరక, మానసిక ఆరోగ్యం కోసం దోహదపడుతుందని చెప్పారు. రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా దంత వైదులు బాలాజీ దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు సత్యశేఖర్, వసుధ, భాను, ఆర్‌ఎంఒ కిరణ్, వినీత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్టియన్ మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం లైసెన్స్ పొడిగింపు

ప్రజాశక్తి-విజయనగరం

క్రిస్టియన్ మ్యారేజ్ సర్టిఫికేట్ జారీ కోసం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా జమ్ము నారాయణపురం బేతనీ మిషన్ చర్చి కు చెందిన చేప శ్రీనివాస రావుకు పదేళ్ల లైసెన్స్ పొడిగింపు చేస్తూ అనుమతి నిచ్చినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

ఒక పూట మాత్రమే పని నిర్వహించాలి : సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే చెల్లించాలని, వేసవి నేపథ్యంలో ఒక్కపూట మాత్రమే పనులు నిర్వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఉదయం దుప్పాడ పంచాయతీ చిల్లపేట చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ పని ప్రారంభించి 14 రోజుల్లో కూలీలకు డబ్బులు చెల్లించాలని చట్టం చెబుతుంటే ఇక్కడ మాత్రం 8 వారాలైనా బిల్లులు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన డబ్బులు రావాలంటే రెండు పూటలు పనిచేయాలని షరతు పెట్టి ఒత్తిడి చేస్తున్నారని, ఎండలు తీవ్రత రీత్యా ఒక పూటే పని నిర్వహించాలని, పని ప్రదేశంలో మజ్జిగ , టెంట్లు, మంచినీళ్లు , కూలీలకు రవాణా ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి 200 రోజుల పని, రోజు కూలి రూ.600 చెల్లించే విధంగా నిధులు పెంచి కేంద్ర బడ్జెట్‌ను సవరించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, లేదంటే ఉపాధి హామీ కూలీలకు సిఐటియుగా అండగా ఉండి వారికి మద్దతుగా పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి హామీ కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

రైల్వేలైన్ బాధితులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సిపిఎం నాయకులు శ్రీనివాస్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

3వ రైల్వే లైన్ పనుల్లో ఇళ్లు కోల్పోయిన పెదమానాపురం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, నిర్వాసిత కమిటీ నాయకులు జి శ్రీనివాస్, చిల్లా గోవింద్, బోర మహేష్, నగిరెడ్ల రాము డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ టిట్లగర్ నుండి విజయనగరం వరకు మూడవ రైల్వే లైను ప్రాజెక్టు సుమారు రూ.4వేల కోట్లతో నిర్మితమవుతున్నదని, ఈ ప్రాజెక్టు నిమిత్తం పెదమానాపురానకి చెందిన 14 మంది ఇళ్లు కోల్పోయారని తెలిపారు. ఆ ఇళ్లకు అరకొర డబ్బులు చెల్లించి కూల్చివేశారరని, మలిదశలో 28కుటుంబాల ఇళ్ల కూల్చివేతకు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారని తెలిపారు. బాధితులకు నిలువు నీడ లేకుండా చేయొద్దని, ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతనెలలో చేపట్టిన ఆందోళన సందర్భంగా ఇళ్ల స్థలాలకు వందరోజుల్లోపు భూమి సేకరించి ఇస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు పట్టించుకోపోవడం అన్యాయమని అన్నారు.ఏదైనా ప్రాజెక్టు కట్టేటప్పుడు పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని, అలా కాకుండా బాధితులకు పట్టించుకోపోవడం అన్యాయమని అన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు సేకరించి ఇవ్వాలని, లేదంటే భవిష్యత్తులో జరిగిన పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత అని పేర్కొన్నారు. మార్చి 27, 28 తేదీలలో మానాపురంలో నిరాహార దీక్షలు రెండు రోజులపాటు చేస్తామని, ఏప్రిల్ 2న చలో తాహశీల్దార్ ఆఫీస్ కార్యక్రమం చేపడతామని వారు తెలిపారు.

మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా లావాదేవీలు

డిఆర్‌డిఎ డిపిఎం చిరంజీవి

ప్రజాశక్తి-రేగిడి

మహిళా సంఘాల లావాదేవీలు మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా చేపట్టాలని డిఆర్‌డిఎ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. ఈ మేరకు రేగిడి మండల సమాఖ్య కార్యాలయంలో విఒఎలు, సిసిలు, ఎంఎంఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాల గ్రేడింగ్ ఇండికేటర్లు గతంలో ఉన్న వాటిని మార్పు చేస్తూ నూతన గ్రేడింగ్ పారామీటర్స్‌పై అవగాహన కల్పించామన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో 6,419 కిచెన్ గార్డెన్లు, కంపోస్ట్ పిట్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రేగిడి మండలంలో 19,586 మందికి గాను 17,653 మందికి సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వారికి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఎం లైవ్ స్టాక్ డాక్టర్ మూర్తి, ఎపిఎం బాసిన గోవిందరావు ఉన్నారు.

ఫార్మర్ చాట్ యాప్‌తో రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఫార్మర్ చాట్ యాప్ ద్వారా రైతులకు ఎంతో ఉపయోగమని డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్ణాపురంలో పైడితల్లమ్మ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఫార్మర్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని మార్కెట్లలో అన్ని పంటల ధరలు తెలుస్తాయన్నారు. పంటలకు నష్టం కలిగించే చీడపీడల నివారణ, మందుల వినియోగం గురించి రైతులు తెలుసుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో బ్రేడ్స్ కో ఆర్డినేటర్ శివ, కిసాన్ ఎఫ్‌పిఒ సిఇఒ అప్పలాచారి, పైడితల్లమ్మ ఎఫ్‌పిఒ అధ్యక్షులు మొంగం ఎరకయ్యదొర, కార్యదర్శి పబ్బిరెడ్డి అప్పడుదొర, ఉపాధ్యక్షులు మొంగం నాగబాబు, డైరెక్టర్లు లంకలపల్లి సాయి, వి.రవి, దంగుడుబియ్యపు ఈశ్వర్రావు, మొంగం శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 98 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శుక్రవారం జరిగిన టెన్త్ ఇంగ్లీషు పరీక్షకు 98 మంది గైర్హాజరైనట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారపు. మొత్తం 22,846 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 22,748 మంది హాజరయ్యారని, 98మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 41 మందికి 20 మంది హాజరయ్యారని తెలిపారు.

బిపిఎం హైస్కూల్ టీచర్‌పై విచారణ

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలో బిపిఎం హైస్కూల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.హరిపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం విద్యా శాఖ ఎడి గౌరీశంకరరావు విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడిపై అతని భార్య స్వాతి తనకు అన్యాయం చేసినట్లు విద్యాశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపగా, 48గంటల పాటు జైల్లో ఉన్నారు. దీంతో డిఇఒ అతడిని సస్పెండ్ చేశారు. విద్యాశాఖకు అందిన ఫిర్యాదు మేరకు ఎడి బి.గౌరీ శంకరరావు హెచ్‌ఎం విశాలక్ష్మితో కలసి శుక్రవారం విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డిఇఒకు అందజేస్తానని ఎడి తెలిపారు.

'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

స్పందనకు వందనం



కారు నేమ్‌బోర్డుపై ఎపిసిగా మార్చిన పేరు

బోర్డు మారింది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'పిఒగా ఎప్పుడయ్యారో' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఆశాఖ అధికారులు స్పందించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పేరు బదులు ప్రాజెక్టు అధికారి, సమగ్ర శిక్ష అభియాన్ అని ఎపిసి వినియోగిస్తున్న కారుకు బోర్డు ఉండడంతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ప్రోజెక్ట్ అధికారి అని ఉన్న బోర్డును తీసివేయించి అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్,సమగ్ర శిక్ష విజయనగరం అనే పేరుతో కొత్త బోర్డును పెట్టారు. ఈ విషయమై జిల్లా కలెక్టరు, రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించినట్లు తెలిసింది.

మ్యుటేషన్ సమస్యలపై నివేదిక ఇవ్వండి

తహశీల్దార్‌కు జెసి ఆదేశం

ప్రజాశక్తి-రేగిడి

సర్వే నంబరు, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పిఎం) అనుసంధానం, మ్యుటేషన్లకు రైతులు పడుతున్న ఇబ్బందులపై 'రైతన్నలకు కష్టాలు' అనే కథనం 'ప్రజాశక్తి'లో శుక్రవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ స్పందించారు. ఈ విషయంపై రేగిడి తహశీల్దార్ ఎన్.చిన్నారావుతో జెసి ఫోన్‌లో మాట్లాడారు. సర్వే నంబరు, ఎల్‌పిఎం, మ్యుటేషన్ల సమస్యపై తక్షణమే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే రైతుల వద్దకు వెళ్లి ముటేషన్ల సమస్యలపై చర్చించి, వాటి సమస్యపై క్షుణ్ణంగా నివేదికలు ఇవ్వాలని సూచించినట్లు తహశీల్దార్ తెలిపారు. మ్యుటేషన్ సమస్యలు పరిష్కరిస్తే ఎంతో మందికి మేలని రైతులు అభిప్రాయ పడ్డారు.

27న వైస్ ఎంపిపి ఎన్నిక

భోగాపురం : మండల పరిషత్ వైస్ ఎంపిపి ఎన్నిక ఈనెల 27న జరగనుంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఉపఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ వెంకటరమణ నియమించారు. మండలంలో ఉన్న 16 మంది ఎంపిటిసిలు హాజరు కావాలని ఈనెల 23లోగా నోటీసులు అందజేయమన్నారు. వైస్ ఎంపిపిగా ఉన్న పడాల సత్యవతి ఆ పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరడంతో వైస్ ఎంపిపి పదవికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

27న శ్యామాయవలస ఉపసర్పంచ్ ఎన్నిక

మెరకముడిదాం : ఈ నెల 27న మండలంలోని శ్యామాయవలస పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు మండల ఎన్నికలాధికారి సుధాకర్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. దానికి సంబంధించిన కాపీని సర్పంచ్ రెడ్డి శాంతమ్మకు అందజేశారు. ఆ కాపీని ప్రాథమిక పాఠశాల గోడకు అంటించారు.

23న ఉల్లాస్ పరీక్ష

సంతకవిటి : వయోజనులకు ఈ నెల 23న ఉల్లాస్ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎపిఎం దదికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలో 48 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఉల్లాస్ పరీక్షకు 1830 మంది వయోజనులు హాజరుకానున్నట్లు చెప్పారు. అనంతరం ఎఒ ఎస్.రఘునాథచారి ప్రశ్నపత్రాలను వెలుగు సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ : మండలంలోని కరకవలస, జగ్గయ్యపేట పాఠశాలలను శుక్రవారం ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరుబయట తిరగకుండా, వడగాల్పులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సంక్షిప్త వార్తలు

రసవత్తరంగా గుర్రపు పోటీలు

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో శ్రీఅభయాంజనేయ ఉత్సవం సందర్భంగా శుక్రవారం గుర్రపు పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 12 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలకు సర్పంచ్ కర్రి యశోద. రామచంద్రుడు మాస్టారు, ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

నేడు వేపాడ మండల సమావేశం

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం వేపాడ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.సత్యవంతుడు ఆధ్వర్యాన నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని సూచించారు. గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని కోరారు.

ప్రకృతి సేద్యంతో రైతులకు మేలు


వేపాడ : ప్రకృతి సేద్యం ద్వారా రైతులకు మేలని వక్తలు తెలిపారు. శుక్రవారం మండలంలోని చినగుడిపాల, కరకవలస, ఎఎస్‌పేట, ఆర్‌ఎస్‌పేట, వీలుపర్తి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు బోజంకి రామునాయుడు, దుల్ల అప్పన్న, సుంకరి రమణమ్మ, వర్ణమాని శర్మ, సేనాపతి అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా భూమి సారవంతంగా ఉండటంతోపాటు ఆరోగ్యవంతమైన పంటలను పొందవచ్చని తెలిపారు.

దీర్ఘకాలిక పన్నులు వసూలు

విజయనగరం టౌన్ : దీర్ఘకాలంగా బకాయి ఉన్న పన్నులను రెవెన్యూ సిబ్బంది వసూలు చేస్తున్నారు. సహాయ కమిషనర్ కె.అప్పలరాజు పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది శుక్రవారం వివిధ ప్రాంతాలలో మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి తక్షణమే పన్ను చెల్లించాలని పట్టుబట్టారు. దీంతో చాలామంది పన్నులను చెల్లించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఆస్తి పన్నులు చెల్లించకుంటే ఇళ్ల కుళాయి కనెక్షన్లను, కరెంటు కనెక్షన్లను తొలగిస్తామని తెలిపారు.

వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా

హీరో ద్విచక్ర వాహనాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపిపి మహంతి కళ్యాణి

హీరో మోటో కార్ప్ జోనల్ హెడ్ సురేష్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా హీరో ద్విచక్ర వాహనాలను సంస్థ రూపొందిస్తున్నట్లు హీరో మోటో కార్ప్ జోనల్ హెడ్ సురేష్ ఆర్ముగం అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాడ జంక్షన్ వద్దనున్న శ్రీలక్ష్మి మోటార్స్ హీరో షోరూమ్ వద్ద ఏర్పాటు చేసిన మెగా సర్వీస్ కమ్ సేల్స్ కార్నివాల్ ఆయనతోపాటు ఎంపిపి మహంతి కళ్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ముగం మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా హీరో సంస్థ ద్విచక్ర వాహనాలను తయారు చేస్తోందని చెప్పారు. పర్యావరణ హితమైన ప్రమాణాలకు అనుగుణంగా హీరో వాహనాల తయారీ ఉంటుందన్నారు. అందుకే తమ వాహనాలకు ఎప్పటికీ ఆదరణ తగ్గలేదని చెప్పారు. మొదటిరోజు మేళాకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభించింది. శ్రీలక్ష్మి మోటార్స్ అధినేత కందికుప్ప చిన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సెకండరీ లీడ్ హెడ్ మనోరంజన్ జేన, ఏరియా మేనేజర్ మహీంద్రన్ పెరుమాళ్ స్వామి, పూసపాటిపాలెం సర్పంచ్ స్వామినాయుడు, వైసిపి మండల నాయకులు మహంతి శ్రీను, శ్రీలక్ష్మి మోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మండవకురిటిలో భారీ చోరీ

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని మండవకురిటి గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. గ్రామంలో దేవిరెడ్డి సన్యాసిరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం కోసి, ఏడున్నర తులాల బంగారం, రూ.4.75 లక్షల నగదు చోరీకి పాల్పడ్డారు. సన్యాసిరావు పది రోజుల నుంచి అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి తిరుగుతున్నాడు. ఇదే అదునుగా భావించి దొంగలు చొరబడ్డారు. చిన్న కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న బంగారం, డబ్బులు దోచుకుపోయారని బాధితుడు సన్యాసిరావు విలపించారు.

రామతీర్థంలో రీ సర్వే ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థంలో రెండో విడత రీసర్వే ర్యాలీని శుక్రవారం తహశీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ దివ్య మానస, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని అల్లువానివలస గ్రామానికి చెందిన దంపరి కల్యాణి (21) కనిపించడం లేదని ఆమె తండ్రి లక్ష్మణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తార కేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 20న ఇంటి నుంచి ఊర్లోకి వెళ్లివస్తానని చెప్పిన కల్యాణి అప్పటి నుంచి కనిపించడం లేదు. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు బాడంగి పోలీస్ స్టేషన్‌కు (9121109455) సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

రాజాం మండలం గాడిముడి గ్రామానికి చెందిన బొంతు కృష్ణ వేణి(30) తన ఏడాదిన్నర కుమారుడితో కలసి తన కన్నవారింటికి డొంకినవలసకు ఈనెల 13న వచ్చింది. ఈనెల 19న బాబుతో కలసి తిరిగి అత్త వారింటికి బయలుదేరింది. అయితే రాజాం చేరుకోలేదు. ఈనేపథ్యంలో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తారకేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.